క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలకు ఫ్యాన్‌ల వితరణ



సీలింగ్ ఫ్యాన్ అందిస్తున్న బౌద్ధ ప్రచారకుడు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు అవసరమైన సీలింగ్ ఫ్యాన్లను బౌద్ధ ప్రచారకుడు బంతేజీ దమ్మానంద శుక్రవారం అందజేశారు. స్థానిక ఇండస్ట్రియల్ కాలనీలోని రామచంద్ర బౌద్ధారామం ఆధ్వర్యంలో హైస్కూల్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని రమణికుమారి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్మోగిన హరేకృష్ణ మహామంత్ర నాద సంకీర్తన



శివాజీ పార్క్‌లో నాద సంకీర్తన చేస్తున్న భక్తులు

ఎంవీపీకాలనీ: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో హరేకృష్ణ మహామంత్ర నాద సంకీర్తన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. శివాజీ పార్క్‌తోపాటు నగరంలోని 20 ప్రాంతాలకు పైగా ఈ కార్యక్రమం జరిగింది. 200 మంది భక్తుల వరకు పాల్గొని నాద సంకీర్తన చేశారు. విశ్వశాంతి, శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువు జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం సాయంత్రం ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువు జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు వివిధ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



దాత రామకృష్ణకు బాండ్ అందిస్తున్న సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి పెందుర్తి దరి సుజాతనగర్‌కు చెందిన దొగ్గ రామకృష్ణ రూ.లక్ష, నెల్లూరు జిల్లా కావలి మండలం పాతపెంట గ్రామానికి చెందిన వి.బాలకృష్ణ రూ.లక్ష 116 విరాళాన్ని అందించారు. కుటుంబ సమేతంగా సింహగిరికి వచ్చిన దాతలు సంబంధిత విరాళాలను నగదు రూపంలో సింహగిరిపైనున్న పీఆర్వో కార్యాలయంలోని విరాళాల స్వీకరణ కౌంటరులో ఇచ్చారు. దేవస్థానం తరపున దాతలకు ప్రొటోకాల్ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ బాండ్‌లు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ త్రిమూర్తులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

వైభవంగా సత్తెమ్మ వార్షిక జాతర

సింహాచలం: అడవివరం గ్రామ పొలిమేర దేవత సత్తెమ్మతల్లి వార్షిక జాతర శుక్రవారం వైభవంగా జరిగింది.మహిళలు అమ్మవారికి చీరలు, పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున అమ్మవారికి అర్చకులు విశేషంగా వైదిక కార్యక్రమాలు నిర్వహించారు.

అనకాపల్లి నూకాంబికా దేవస్థానం ఈవోగా వెంపలి

మహారాణిపేట: అనకాపల్లిలోని శ్రీ నూకాంబికా అమ్మవారి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా సింహాచలం దేవస్థానం ఏఈవో వెంపలి రాంబాబు నియమితులయ్యారు. శ్రీ కనక మహాలక్ష్మి ఆలయంలో ఏఈవోగా చేస్తున్న రాంబాబును ఇటీవల సింహాచలం దేవస్థానం ఏఈవో గా బదిలీ చేశారు. ఆయనకు సహాయ కమిషనర్‌గా పదోన్నతి లభించడంతో అనకాపల్లి దేవస్థానానికి సహాయ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)గా నియమించారు. ప్రస్తుతం నూకాలమ్మ దేవస్థానం ఇన్చార్జి ఈవోగా దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ (డీసీ) ఎన్.సుజాత చేస్తున్నారు. శనివారం రాంబాబు ఈవోగా బాధ్యతలు స్వీకరించే అవకాశాలున్నాయి.

రంగుల కేళి.. ఆనందాల హోలీ



104 ఏరియా బాపూజీనగర్‌లో హోలీ జరుపుకొంటున్న చిన్నారులు

రంగుల పండగ హోలీని చిన్నారులు, యువకులు ఉత్సాహంగా జరుపుకొన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో చిన్నారులు రంగులు పూసుకుని, రంగు నీరు జల్లుకుంటూ హ్యాపీ హోలీ అంటూ శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నార్త్ ఇండియన్స్ సందడి చేశారు. నేవీ ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలసి హోలీ పండగ చేసుకున్నారు. యువకులు రంగులు పూసుకుంటూ వీధుల్లో సందడి చేశారు. మేహాద్రి గెడ్డ కాలనీ, కొత్తపాలెం, ఇందిరానగర్ ప్రాంతాల్లో యువకులు హోలీని సంతోషంగా జరుపుకొన్నారు. ఎన్ఏడీ సెంటర్, మర్రిపాలెం వుడా లే అవుట్ కాలనీ, బుచ్చిరాజుపాలెం, ఏపీఎస్ఈబీ కాలనీ, విమాన్ నగర్, 104 ఏరియా బాపూజీనగర్, ఐటీఐ జంక్షన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, జ్ఞానాపురం, తాటిచెట్లపాలెం, కంచరపాలెం, ఊర్వశి కూడలి తదితర ప్రాంతాల్లో యువత, చిన్నారులు సందడి చేశారు.

– విశాఖ విద్య/గోపాలపట్నం/మల్కాపురం/కంచరపాలెం







కొత్త పాలెంలో హోలీ సందడి



మర్రిపాలెంలో రంగులు పూసుకుంటున్న చిన్నారులు

ప్రయాణం.. నరకప్రాయం

- చుక్కలు చూపిస్తున్న 3 కి.మీ.మార్గం
- దశాబ్దాలుగా మారని వైనం
- రాకపోకలకు తప్పని అవస్థలు
- రహదారికి మోక్షం ఎప్పుడా అని నిరీక్షణ



వెంకటాపురం నుంచి కొత్తపాలెం వెళ్లే రహదారి ఇలా..



వెంకటాపురం 5 మదుముల వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

గోపాలపట్నం: వెంకటాపురం నుంచి కొత్తపాలెం వరకు ఉన్న రహదారి అధ్వానంగా ఉండటంతో ఆ మార్గంలో ప్రయాణించేవారు ఇబ్బంది పడుతున్నారు. సుమారు 3 కి.మీ. మేర ఉన్న ఈ రోడ్డులో ప్రయాణం వాహనచోదకులకు చుక్కలు చూపిస్తోంది. నాయకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో దశాబ్దాలుగా ఇదే దుస్థితి నెలకొంది. మట్టి, మెటల్ రోడ్డుగానే మిగిలిపోయిన ఈ రోడ్డు ఎప్పుడు బాగుపడుతుందా అని రాకపోకలు సాగించేవారు నిరీక్షిస్తూనే ఉన్నారు.

రెండు వార్డులను కలిపే దారి

జీవీఎంసీ 92, 89 వార్డులను కలిపే రహదారి ఇది. ఈ రహదారి బాగు పడితే చాలా గ్రామాలకు దగ్గర దారి అవుతుంది. కొత్తపాలెం నుంచి నాయుడు తోట, వేపగుంటకు వెళ్లే దారి చాలామేరకు తగ్గుతుంది. అలాగే, వెంకటాపురం నుంచి నరవ, ఎన్ఏడీ వెళ్లేవారికి కూడా చాలా సులువవుతుందని స్థానికులు చెబుతున్నారు.

సమస్యంతా 5 మదుముల వద్దే ..

ఈ రహదారి అభివృద్ధికి రైల్వే స్థలమే అడ్డంకిగా మారింది. ఇక్కడ ఐదు మదుముల వద్ద సుమారు 100 నుంచి 200 మీటర్ల వరకు రైల్వే స్థలం ఉంది. ఆ ప్రాంతంలో రహదారిని అభివృద్ధి చేయాలంటూ రైల్వే అధికారులకు గత ప్రభుత్వ హయాంలో ఎన్నో అర్జీలు పెట్టారు. ఉన్నతాధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. అయినా పరిస్థితిలో మార్పు లేదు. ఇక్కడి నుంచి 89వ వార్డు పరిధిలో రహదారిని అభివృద్ధి చేయాల్సి ఉంది. జీవీఎంసీ అధికారులు కనీసం ఈ రహదారినైనా బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ సారైనా..

కూటమి ప్రభుత్వం చొరవ చూపి ఈ సారైనా రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. రైల్వే అధికారులపై ఒత్తిడి తీసుకు వచ్చి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. జీవీఎంసీ, రైల్వే అధికారులు సంయుక్తంగా పర్యటించి, పరిశీలించి రహదారిని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



రాళ్లు తేలిన రహదారి

చాలా గ్రామాలకు దగ్గర దారి

ఈ మార్గంలోనే రోజూ ప్రయాణిస్తుంటాం. రోడ్డంతా రాళ్లు తేలి ఉండడంతో ఒళ్లంతా పులిసిపోతుంది. కొత్తపాలెం నరవ వెళ్లాలంటే భయమేస్తుంది. ఈ మూడు కిలోమీటర్ల ప్రయాణం నరకం చూపిస్తుంది. చాలా ఇబ్బంది పడుతున్నాం.

– గంగరాజు, పద్మనాభనగర్

వాహనాలు పాడవుతున్నాయి

ఈ మార్గంలో ద్విచక్రవాహనంపై రోజూ వేపగుంట వెళ్లి వస్తుంటాను. రహదారి అంతా రాళ్లు తేలి, గోతులతో ఉండడంతో బండి తరచూ పాడవుతోంది. గుంతల కారణంగా ఒళ్లంతా నొప్పులు. అధికారులు, నాయకులు మా ఇబ్బందిని గమనించాలి. రహదారి బాగుపడేలా చూడాలి.

– రాజేష్ కొత్తపాలెం

సీపీ చొరవతో ఇంటికి చేరిన నిజామాబాద్ వాసి

- పదేళ్ల తర్వాత కుటుంబ సభ్యుల చెంతకు శ్రీను



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నరసింహమూర్తి

ఎంవీపీకాలనీ: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి చొరవతో నిజామాబాద్‌కు చెందిన శ్రీను అనే వ్యక్తి సొంతింటికి చేరాడు. శుక్రవారం ఎంవీపీ పోలీసుల సమక్షంలో కుటుంబ సభ్యులకు అతడిని అప్పగించారు. పదేళ్లుగా శ్రీను జాడ కోసం పరితపిస్తున్న కుటుంబ సభ్యులు ఆనందంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి ఈ వివరాలు వెల్లడించారు.

ఇటీవల సీపీ బాగ్చి బీచ్ రోడ్డులో ప్రయాణిస్తుండగా లాసన్స్ బే కాలనీలో మతిస్థితిమితం లేకుండా, దుస్తులు కూడా సరిగా లేని ఓ వ్యక్తి ఉండటాన్ని గమనించారు. అతడిని సంరక్షించి వివరాలు తెలుసుకోవాలని సూచించడంతో ఆ దిశగా ఎంవీపీ పోలీసులు చర్యలు చేపట్టారు. సీఐ మురళీ సూచనలతో ఆ వ్యక్తిని ముందుగా రెడ్‌క్రాస్ షెల్టర్‌లో చేర్పించారు. షెల్టర్ నిర్వాహకులు అతడిని సంరక్షించి, వివరాలు సేకరించగా.. శ్రీనుది నిజామాబాద్‌గా చెప్పినట్లు వారు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో సీఐ మురళీ బృందం అతడి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. శుక్రవారం వారు నగరానికి చేరుకోగా.. ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో శ్రీనును అతడి తమ్ముడు, ఇతర కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఈ సందర్భంగా శ్రీను తమ్ముడు మాట్లాడుతూ తన అన్నను అప్పగించిన విశాఖ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు. సీపీ, ఏసీపీతోపాటు ఎంవీపీ పోలీసుల సేవలను అభినందించారు. పదేళ్లుగా వెతుకుతున్నట్లు వెల్లడించిన శ్రీను తమ్ముడు 2016 హైదరాబాద్ చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు. సీఐ మురళీ, ఎస్ఐలు ఎం.శ్రీను, ధనుంజయ్‌నాయుడు, బాషా తదితరులు పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్‌లకు కొత్త హంగులు



60వ వార్డు గుల్లలపాలెం వద్ద రంగులు వేసిన సులభ్‌కాంప్లెక్స్



శ్రీహరిపురం సులభ్ కాంప్లెక్స్ చుట్టూ ఏర్పాటు చేసిన మొక్కలు



టాయిలెట్ల వద్ద చుట్టూ వేసిన టైల్స్, రంగులు

సులభ్ కాంప్లెక్సులు పరిశుభ్రంగా మారాయి. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ నిధులతో 60వ వార్డు పరిధిలోని పలు సులభ్‌కాంప్లెక్స్‌లకు కొత్త హంగులు ఏర్పాటు చేశారు. గుల్లలపాలెం, శ్రీహరిపురం తదితర ప్రాంతాలలోని సులభ్ కాంప్లెక్స్‌లకు రంగులు వేయడంతో పాటు.. పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించే పలు చిత్రాలను ఇక్కడ చిత్రించారు. మరుగుదొడ్ల వద్ద కొత్త టైల్స్ ఏర్పాటు చేసి, కొత్తవాటిగా తీర్చిదిద్దారు.

– మల్కాపురం

ప్రారంభ దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ

- షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్ ఖత్రి
- హెచ్ఎస్ఎల్ ఆధ్వర్యంలో 300 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు
- 200 మందికి సెర్వా వాక్ టీకాలు



జ్యోతి ప్రజ్వలనతో సెర్వావాక్ వ్యాక్సినేషన్‌ను ప్రారంభిస్తున్న హెచ్ఎస్ఎల్ అధికారులు

సింధియా: క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే నివారించగలమని షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్ ఖత్రి అన్నారు. హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ సీఎస్సార్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, సెర్వావాక్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒమెగా హాస్పిటల్ భాగస్వామ్యంతో మల్కాపురంలోని ఈఎస్ఐ ఆస్పత్రి ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఇటీవల మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి వ్యాధులు సోకుతున్న తరుణంలో ఈ నిర్ధారణ పరీక్షలు, వ్యాక్సినేషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 14 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు గల సుమారు 300 మంది మహిళలు, బాలికలకు క్యాన్సర్ పరీక్షలు చేశారు. 200 మందికి సెర్వావాక్ వ్యాక్సిన్‌ను ఉచితంగా వేశారు. అనంతరం హెచ్ఎస్ఎల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ హెచ్‌పీవీ గురించి వివరించారు. కార్యక్రమంలో కెప్టెన్ జి.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ షిప్ బిల్డింగ్, ఈఎస్ఐ సూపరింటెండెంట్, ఒమేగా హాస్పిటల్ అంకాలజిస్టులు, హెచ్ఎస్ఎల్ అధికారులు, షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఎంవీపీ రైతుబజార్ తనిఖీ



అధికారులకు సూచనలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ రైతు బజార్‌ను రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఎం.విజయ సునీత పరిశీలించారు. ఉత్తరాంధ్ర పర్యటన నేపథ్యంలో విశాఖకు వచ్చిన ఆమె శుక్రవారం సాయంత్రం ఎంవీపీ రైతు బజార్‌ను తనిఖీ చేశారు. ఇటు రైతులకు, అటు వినియోగదారులు ఇబ్బందులు లేకుండా ధరలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. పలువురు రైతులతో ముచ్చటించారు. రైతుల కార్డులు, డ్వాక్రా కౌంటర్లను పరిశీలించారు. రైతులు తీసుకొస్తున్న టమోటా, డ్వాక్రా రైతులు అమ్ముతున్న ఉల్లిపాయల నాణ్యతను పరిశీలించారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు అందిస్తున్నారా లేదా అనే అంశంపై ఆరా తీశారు. ప్రతి నెల 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని, అందులో రైతులను భాగస్వాములను చేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ పి.సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ జి.శ్రీనివాస్ కిరణ్, ఏడీ యాసిన్, ఈవో వరహాలు తదితరులు పాల్గొన్నారు.

వీఎల్‌వో క్యాడర్‌కు గెజిటెడ్ హోదా కల్పించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఫెడరేషన్ సభ్యులు

ఏయూక్యాంపస్: ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరియన్స్ ఫెడరేషన్ జోన్-1 కార్యవర్గ సమావేశం శనివారం పశుసంవర్ధక శాఖ సంచాలకుల కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ బి.సేవా నాయక్, ప్రధాన కార్యదర్శి బి.గోవిందరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.విజయ సారథి, కోశాధికారి డి.కోదండ రావు, పాల్గొని సమస్యలపై చర్చించారు. ప్రధానంగా వీఎల్‌వో క్యాడర్‌కు గెజిటెడ్ హోదా కల్పించాలని, పారా వెటర్నరీ కౌన్సిల్ పూర్తిస్థాయిలో ప్రభుత్వం త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా ఫెడరేషన్ చైర్మన్‌గా డి.కోదండరావును, అనకాపల్లి జిల్లా ఇంచార్జి చైర్మన్‌గా వెంకట లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కో చైర్మన్ వైవీ ప్రసాద రావు, ఎం.రాఘవరావు, ఎం.సాగర్ బాబు, ఆర్.రవికుమార్ పాల్గొన్నారు.

ముగిసిన సహస్ర పూర్ణచంద్ర దర్శనోత్సవం



పూర్ణాహుతిలో పాల్గొన్న గురుమాత అన్నపూర్ణమ్మ

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో సహస్ర పూర్ణచంద్ర దర్శనోత్సవం గురుపాదుకా పూజతో శుక్రవారం ముగిసింది. గురువారం ప్రారంభమైన కార్యక్రమంలో భాగంగా నవగ్రహ మండపం, బ్రహ్మ మండపం, సర్వతోభద్ర మండపం, రుద్రమండపం, కలశ స్థాపన పూజలు జరిగాయి. ఋత్వికులు మృత్యుంజయ జపాలు, నవగ్ర జపాలు, ఆయుష్య సహిత పారాయణ, జన్మ నక్షత్ర జపాలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు యూఎస్ఏ, యూకే, కెనడా తదితర విదేశాల నుంచి వచ్చిన అనేక మంది శిష్యులు వచ్చారు. ఉదయం నుంచి వల్లభేశక్షేత్ర పాల దశ మహావిద్య సహిత విద్యామ్నాయ కలశ స్థాపన, లలితా సహస్రనామార్చనలు జరిపారు. సాయంత్రం గురు పాదుకా పూజ, నృత్యాలు, భజనలతో పాటు అమృత కన్యా గురుకులం బాలికలు సైన్స్ ప్రాజెక్ట్ ప్రదర్శించారు.

బాధిత రైతులకు న్యాయం చేయాలి



రైతులకు మద్దతు తెలుపుతున్న సీపీఐ నాయకులు

పెందుర్తి: రైల్వే వంతెన నిర్మాణంలో సాగు చేసుకుంటున్న భూములను కోల్పోతున్న రైతులకు సమగ్ర విచారణ చేపట్టి తగిన న్యాయం చేయాలని సీపీఐ నేతలు ఆర్.శ్రీనివాస్, వై.రాంబాబు డిమాండ్ చేశారు. నార్త్ సింహాచలం నుంచి పెందుర్తి రైల్వే లైన్ సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల ధర్నా శిబిరాన్ని శుక్రవారం సందర్శించి, సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ ఇక్కడి భూముల్లో దశాబ్దాలుగా వ్యవసాయం చేసుకుంటూ రైతులు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు రైల్వే అధికారులు సింహాచలం దేవస్థానానికి పరిహారం ఇస్తామనడంతో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆక్షేపించారు. ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి, రైతులకు న్యాయం చేయాలని కోరారు. ధర్నాలో రైతులు, సీపీఐ సానుభూతిపరులు పాల్గొన్నారు.